బిజెపి దాడి అప్రజాస్వామికం : పిసిసి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికం, పిరికిపంద చర్య అని పిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ కాంగ్రెసు పార్టీ కార్యాలయంపై, పిసిసి చీఫ్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులపై బిజెపికి చెందిన కొందరు నాయకులు కోడిగుడ్లుతో టమోటాలతో దాడి చేయడం శోచనీయమన్నారు. బిజెపి నాయకులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని, 11 ఏళ్లుగా ప్రధాని మోడీ దేశాన్ని నాశనం చేశారని, టిడిపి, జనసేన నాయకులు ఎలాగో ప్రశ్నించలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్టంలో కానీ, దేశంలో కానీ ఎక్కడ శాంతి భద్రతలు లేవన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతల వైఫల్యం కొట్టికొచ్చినట్లు కనిపిస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు బిజెపి చేతిలో కీలుబొమ్మ అని స్పష్టం అవుతోందని విమర్శించారు. కాంగ్రెస్ తన బలాన్ని కూడగట్టుకొని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకోసం ఎంత తీవ్రంగా పోరాడుతుందో చూసి కూటమి ప్రభుత్వానికి భయంపట్టుకొందని, ఇందుకు నిదర్శనమే బిజెపి గుండాలు చేసిన దాడి అని పేర్కొన్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, దాడికి ప్రయత్నించిన బిజెపి గుండాలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సిపిడబ్ల్యు స్కీముల టెం'డర్'

నేడో, రేపో 13 స్కీములకు టెండర్లు ఓపెన్
లక్కిరెడ్డిపల్లి స్కీంపై పొలిటికల్ ఫోకస్!
అడకత్తెరలో పోకచెక్కలా ఆర్‌డబ్ల్యుఎస్

జిల్లాలోని సిపిడబ్ల్యు స్కీముల టెండర్ల చుట్టు రాజకీయం నడుస్తోంది. ఉభయ జిల్లాలకు చెందిన అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల తమ అనుచరులకు కాంట్రాక్టుల్ని ఇప్పించుకోవాలనే ఉద్దేశంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లపై ఒత్తిడి పెంచుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లా పరిధిలోని లక్కిరెడ్డిపల్లి సిపిడబ్ల్యు స్కీమ్, అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని పెనగలూరు, రాజంపేట స్కీమ్‌లపై రాజకీయ ఒత్తిడి పెద్దఎత్తున ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. సిపిడబ్ల్యుస్కీమ్ తాగునీటి సరఫరా పథకం పనుల్లో అనుభవం, తక్కువకు టెండర్‌ను కోట్ చేసిన, పనుల్లో నాణ్యత కలిగిన గుత్తేదారులను కాదని, అధికార పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టాలనే కుతంత్రాలపై విమర్శల వర్షం కురుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సిపిడబ్ల్యు స్కీముల టెండర్ల ఓపెనింగ్ వ్యవహారం క్లైమాక్స్‌కు చేరుకుంది. జిల్లాలో కమలాపురం, యోగివేమన, బి.మ ఠం, మైదుకూరు, మాధవరం-1, కె.మాధవరం, పులివెందుల, పులివెందుల అప్‌ల్యాండ్ ఏరియా, వేంపల్లి, కె.యర్రగుడి, మైలవరం, ముద్దనూరు, కొండాపురం ప్రాంతాల్లోని సిపిడబ్ల్యు స్కీములు ఉన్నాయి. వీటికి రూ.17.90 కోట్లతో జిల్లాలోని 35 మండలాల పరిధిలో 553 పంచాయతీల పరిధిలోని 13.51 లక్షల మందికి సిపి డబ్ల్యుఎస్ స్కీముల ద్వారా శుద్ధజలాన్ని అందించడానికి ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ కాంట్రాక్టు టెండర్లు పిలిచింది. 2025 ఏప్రిల్ 11న టెండర్లు పిలిచింది. ఏప్రిల్ 26న టెండర్లు ఓపెన్ చేయడానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 13 సిపిడబ్ల్యు స్కీముల్లో 11 స్కీమ్‌లకు టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ యంత్రాంగం సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీల పేర్ల వివరాలను ప్రకటించడంలో గోప్యత పాటిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లకు వెరసి గోప్యత పాటిస్తోందా, లేక డిస్క్వాలిపై బారిన పడిన కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయనే కోణంలో గోప్యతను పాటిస్తో ందనే అంశం తెలియడం లేదు.

లక్కిరెడ్డిపల్లి స్కీమ్ చుట్టూ రాజకీయం

లక్కిరెడ్డిపల్లి సిపిడబ్ల్యు స్కీమ్ కాంట్రాక్టు చుట్టూ రాజకీయ ఒత్తిళ్ల పతాకస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. జమ్మలమడుగుకు చెందిన ఓ కాంట్రాక్టరుకు కట్టబెట్టాలనే ఉద్దేశంతో అన్నమయ్య జిల్లాకు చెందిన కీలక రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. టెండరు నుంచి తప్పుకోవడానికి రూ.లక్షలాది ఆఫర్ చేసినట్లు ప్రచారంలో ఉంది. లక్కిరెడ్డిపల్లి సిపిడబ్ల్యు స్కీమ్ టెండరు బరిలో నిలిచిన కాంట్రాక్టర్లతో జిల్లా రాజకీయ నాయకత్వం సంప్రదింపులు చేసినట్లు సమాచారం. ఇంతటితో ఆగకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులపై సైతం ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. డిస్క్వాలిఫై వంటి కుతంత్రాలకు పాల్పడకుండా లెస్ వేసిన గుత్తేదారులకు కట్టబెడితే రాష్ట్ర ప్రభుత్వానికి రూ.25 లక్షలు మిగిలే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. లక్కిరెడిపల్లి సిపిడబ్ల్యు స్కీమ్ టెండరు ఓపెన్ చేయడానికి ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా ఇంజనీరింగ్ యంత్రాంగం తటపటాయిస్తున్నట్లు సమాచారం.

లెస్‌దారుల గుండెల్లో ఎఎస్‌డి

సిపిడబ్ల్యు స్కీములకు అధిక లెస్ వేసిన టెండరుదారుల గుండెల్లో అడిషనల్ సెక్యూరిటీ డిపాజిట్ (ఎఎస్‌డి) జమ చేయాలనే నిబంధన గుబులు రేపుతోంది. మాధవరం-1 స్కీముకు 53 శాతం లెస్ వేసిన టెండరుదారునిపై రూ.18 లక్షల మేరకు ఎఎస్‌డి జమ చేయాలనే నిబంధన అమలు చేసినట్లు సమాచారం. పలువురు కాంట్రాక్టర్లు పలు స్కీములకు అధిక శాతానికి లెస్ వేసినట్లు తెలుస్తోంది. మూడు శాతం నుంచి 53 శాతం వరకు లెస్ వేసిన కాంట్రాక్టరు గ్రామీణులకు పూర్తి స్థాయిలో ఎలా నీటిని సరఫరా చేస్తారనే కోణంలో ఎఎస్‌డి నిబంధన అమలు చేసినట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ యంత్రాంగం టెండర్లు ఓపెనింగ్, ఎఎస్‌డి వ్యవహారాల్లో సమర్థత ఆధా రంగా సిపిడ బ్ల్యు స్కీములు భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పవచ్చు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

- బహిరంగ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు
- డప్పు, నృత్య, కోలాట ప్రదర్శనతో నిరసన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం ఉన్న హక్కులు, చట్టాలను రద్దు చేశాయని వాటిని పునరుద్ధరించే వరకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. గురువారం మేడే సందర్భంగా పట్టణంలో విద్యుత్, ఐసిడిఎస్, రెవెన్యూ, బస్టాండ్, మున్సిపల్ ఆఫీస్ మార్కెట్ యార్డ్‌లో 7 చోట్ల సిఐటియు జెండాలు ఆవిష్కరణ చేసి పూలమాలలతో మేడే అమరవీరులకు నివాళి అర్పించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ఎర్ర జెండా చేత బట్టి, యాజమాన్యాల అధిక లాభాల కోసం కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఎనిమిది గంటలు పని అమలుచేయాలని కార్మికులు నినదించారు. వారి నిరసన గళం ప్రతి ధ్వనులతో నిండగా పిడికిళ్లు బిగించి గాల్లోకి పంచులు వేసి నిరసన తెలిపిన తీరు, డప్పుల శబ్దాలు, కార్మికుల నృత్యాలు మహిళల కోలాటాలు అందరిని ఆకర్శించింది. ప్రభుత్వాసుపత్రి వద్ద మానవహారంతో భారీ ట్రాఫిక్ ఏర్పడిన వైనం కార్మికుల్లో ఐక్యత, ప్రభుత్వాల మీద తీవ్ర అసంతృప్తికి నిదర్శనంగా నిలిచాయి. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, డి.భాగ్యలక్ష్మి, ఎ.వి.రమణ బంగారు పాప, శంకరయ్య చెన్నయ్య, రాంబాబు, గ్రామసేవకులు నరసింహులు, ఆశా లీడర్ రమాదేవి, సిద్దమ్మ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాల మీద మండిపడ్డారు. రైతుల వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రయివేట్ చేయద్దని, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేసే వరకు ఐక్య ఉద్యమాలతో పోరాడి హక్కులు లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాడతామని వ్యాఖ్యానించారు. అనంతరం కార్మిక, కర్షక ఐక్యత వర్ధిల్లాలని, సామ్రాజ్యవాదం నశించాలని, సోషలిజం వర్ధిల్లాలని, కార్మికుల అంతర్జాతీయ వాదం వర్ధిల్లాలని మేడే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి, బ్యాంకింగ్, పోస్టల్, ఫుట్ పాత్ వర్కర్స్, ఆటో హమాలీ, బిల్డింగ్, అంగన్వాడీ, మున్సిపల్, ఆశా మధ్యాహ్నం భోజనం, ఆప్కాస్, సమగ్ర శిక్ష, బీడీ, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాయచోటి : ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

మదనపల్లె : మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన బిజెపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాడు కార్మిక వర్గం పోరాడి ప్రాణత్యాగం చేసి 8 గంటల పని దినం మొదలుకొని అనేక హక్కులు సాధించుకుంటే నేడున్న బిజెపి పాలకులు కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని, మేడే స్ఫూర్తితో హక్కుల పునరుద్ధరణ కోసం కార్మిక, కర్షక మైత్రితో ఉద్యమించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిటిఎం రోడ్డులోని గ్రంధాలయం మైదానం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో మే డే సభ నిర్వహించారు. స్థానిక కదిరి రోడ్డులోని భాగ్యలక్ష్మి మిషన్ నుండి ప్రారంభమైన కార్మిక ప్రదర్శన మల్లిఖార్జున సర్కిల్, బెంగళూరు బస్టాండ్, అప్పారావు వీధి, నెహ్రూ బజార్, చిత్తూరు బస్టాండ్, సుందరయ్య సర్కిల్, సిటిఎం రోడ్డు గుండా గొల్లపల్లి సర్కిల్‌లోని గ్రంధాలయం గ్రౌండ్ చేరుకుంది. మేడే వర్ధిల్లాలి, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి, కార్మిక చట్టాలు పునరుద్ధరించాలి, మతోన్మాదాన్ని తరిమి కొడదాం, ఉగ్రవాదాన్ని అంతం చేయాలి అంటూ కార్మికులు ప్రదర్శన ఆద్యంతం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం హమాలీ యూనియన్ నాయకులు రమణరావు అధ్యక్షతన జరిగిన సభలో పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరింద్రనాథ్ శర్మ, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శులు రాజేశ్వరి, మధురవాణి, మున్సిపల్ యూనియన్ నాయకులు రామకృష్ణ, ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ అమెరికా పెట్టుబడి దారి దేశంలో కార్మిక వర్గం తిరగబడి ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించడం జరిగిందన్నారు. ఈ పోరాటంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, రక్తపు మడుగులో తడిసిన జెండానే ఎర్ర జెండా అని తెలిపారు. ఎర్ర జెండా అన్ని దేశాల్లో ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన కార్మిక హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను హరించే విధంగా లేబర్ కోడ్ విధానం ఉందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినప్పటికీ అమలు జరపడం లేదని విమర్శించారు. రాజధాని అమరావతిని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్రాంట్‌గా నిధులు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సభలో ముందుగా ప్రముఖ న్యాయవాది సోమశేఖర్ కుమార్తెలు స్నేహలత, స్వేచ్ఛలతల నృత్యం, అంగన్వాడీ బృందం ప్రదర్శించిన నాటకం, హమాలీ కార్మికులు వేసిన డాన్స్ లాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాయి.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-పీలేరు

మహిళల్లో ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తూందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. బిసి కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ సంస్థల ద్వారా పీలేరుకు మంజూరైన మహిళా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం స్థానిక సిఎల్‌ఆర్‌సి భవనంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని అన్నారు. 90 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. మహిళలు సొంతంగా బట్టలు కుట్టుకోవడం లేదా గార్మెంట్ కంపెనీల్లో ఉపాధి పొందడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కలికిరి, పీలేరు ప్రాంతానికి గార్మెంట్ కంపెనీ వచ్చే అవకాశం కూడా ఉందని తెలియజేశారు. మహిళలు శ్రద్ధగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ ఉదయం ఒక బ్యాచ్, మధ్యాహ్నం మరో బ్యాచ్ వంతున మొత్తం రెండు బ్యాచులుగా 120 మందికి శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. శిక్షణ కోసం వచ్చేవారికి ఫేషియల్ అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, 90 రోజుల శిక్షణ కార్యక్రమంలో కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి అని, అలా ఉన్నవారికి మాత్రమే ఉచిత కుట్టు మిషన్లు మంజూరు అవుతాయని తెలియజేశారు. ఈ సదవకాశాన్ని స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు ఎంపిడిఒ శివశంకర్, ఇఒపిఆర్‌డి లతీఫ్ ఖాన్, శిక్షణాకేంద్రం నిర్వాహకులు, ట్రైనర్లు, వారి సహాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపల్లి బాబు రెడ్డి, డాక్టర్ మల్లెల రెడ్డి బాష, శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, యల్లెల రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ యుపి పాఠశాలను కొనసాగించాలి

- పాఠశాల పేరెంట్స్ కమిటీ, ముస్లిం మత పెద్దలు డిమాండ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని చింతపర్తి ఉర్దూ యుపి పాఠశాలను కొనసాగించాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ, ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. గురువారం చింతపర్తి టిడిపి నాయకులు శేషాద్రి రెడ్డి, ద్వారకనాథ రెడ్డిలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలగా ఉండడంతో గత 25 సంవత్సరాల క్రితం ఈ పాఠశాలను ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. ఉన్నఫలంగా పాఠశాలను డీగ్రేడ్ చేస్తే తమ పిల్లలను చదివించేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు 6వ తరగతికి వెళ్లాలంటే పది కిలో మీటర్ల దూరంలో ఉన్న వాల్మీకిపురం పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. అనంతరం దీనిపై స్పందించిన టిడిపి నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి నజీర్ అహ్మద్, మైనార్టీ నాయకుడు జమీరుద్దిన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు వినతిపత్రం అందిస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

'అమరావతి' పేరుతో వృథా ఖర్చులు

-డిసిసి జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తుతం రాష్ట్రంలోని పరిస్థితులు జీవన ఉపాధి లేక ప్రజలు అల్లాడుతుంటే వృథా ఖర్చు ప్రజలపై భారం పడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో మీరు అమరావతి శంకుస్థాపనకు రాష్ట్ర ప్రజల సమక్షంలో ఢిల్లీ కన్నా అందమైన రాజధాని నిర్మాణం ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతుందని మీరే చెప్పారు అని ఆరోజు శంకుస్థాపన చేసిన మీరు ఈరోజు మరోసారి శంకుస్థాపన చేయడం అవి తగు శోచనీయమన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలకు జీవన ఉపాధి కల్పించండి నిత్యవసర వస్తువుల పైన ధరలు తగ్గించాలిన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎల్లప్పుడూ మీరే ఉండరు అని ప్రజలు మీకు ఇచ్చిన సమయాన్ని వ ృథా చేయకుండా ప్రజలకు మేలు చేయాలిన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు పోలవరం ప్రాజెక్ట్ ద ృష్టి సారించి రాష్ట్రంలో రైతులకి వ్యవసాయం లేదు సామాన్య ప్రజలకి జీవనోపాధి లేదు వృథా ఖర్చు చేయకుండా ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాకిస్తాన్‌కు వెళ్లిపోండి అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన హద్దులు మించి మాట్లాడుతున్నారున్నారు. చిరంజీవికి గతంలో రాజ్యసభ ఇచ్చి కేంద్ర మంత్రిగా ఆయనకు అవకాశం కల్పించిందన్నారు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీని పవన్ కళ్యాణ్ విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారి ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్, వైఎస్ ప్రెసిడెంట్ ఎస్.ఖదీర్, దర్బార్ బాష, జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్ భాష, సెక్రటరీ రఫిక్, సుండుపల్లి మండల ఇన్‌ఛార్జి సల్మాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

ఆ ఘనత వైఎస్‌ఆర్‌కే దక్కుతుంది : 'గడికోట'

ప్రజాశక్తి - సంబేపల్లె (రాయచోటి టౌన్)

ఏకిల కులస్తులను బిసిలో చేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం పాలెంగడ్డ పాపన్నగారిపల్లెలో ఓ విందులో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణు వర్ధన్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు గొర్ల రమేష్‌రెడ్డి, యువనేత గొర్ల అనిరుధ్‌రెడ్డితో కలసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గత జగన్ ప్రభుత్వంలో బలహీన, బడుగు వర్గాలకు పెద్దపీటవేశారని చెప్పారు. బిసి లంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ అని మాజీ సిఎం జగన్ నిరూపించారని, వైఎస్‌ఆర్ చేయూత, నేతన్న నేస్తం, రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, ఆటో వాలాలకు ఆర్థిక సహాయం, అమ్మఒడి తదితర ఎన్నో పథకాలను అందించారని పేర్కొన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరవు ఏర్పడిందని, వ్యవసాయ, కూలీ పనులు సైతం దొరక్క ఇబ్బందులు పడుచున్నామని, వేరుశనగ తదితర పంటలు నష్టపోయినా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీలు అందలేదని, పాల రేట్లను బాగా తగ్గించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ హయాంలో పంటలు నష్టపోతే ఆ సీజన్ ముగిసేలోగా పరిహారం అందేదని, ఆ పరిస్థితులు ఇప్పుడు లేవని, కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమం పథకం అందడం లేదని ప్రజలు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నాగిరెడ్డి, ఆనంద్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వాసుదేవరెడ్డి, నరసింహారెడ్డి, నాగయ్య నాయుడు, కొండయ్య నాయుడు, రెడ్డెప్ప, కొండయ్య, చిన్న నాగయ్య, నరసింహులు, లోకనాథ, నాగరాజ, ఈశ్వరయ్య, అమరేంద్ర, మహేశ్వర, శంకరయ్య నాయుడు, ఆంజనేయులు నాయుడు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, అధికారులు

కౌమార బాలికల సాధికారతే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'కిషోరీ వికాసం' పై పోస్టర్‌లను కలెక్టర్ శ్రీధర్ చామకూరి గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా వేసవి సెలవులలో ఈ నెల 2 నుండి జూన్ 10 వరకు వివిధ శిక్షణ కార్యక్రమాలను కౌమార బాలికలకు అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా కౌమార బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు, సైబర్ , ఆన్లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాలను కౌమార బాలికలు అందరూ వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఎమ్మెల్యే పీలేరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో గురువారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీలేరుకు 100 పడకల ఆసుపత్రి అవసరాన్ని గుర్తించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తన అన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నప్పుడే జీవో జారీ చేశామని, ఆ తరువాత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనూ మరోమారు జీవో జారీ చేశామన్నారు. అప్పట్లో అనివార్య కారణాల వల్ల పనులు ప్రారంభించడంలో ఆలస్యం జరగడంతో ఆసుపత్రి నిర్మాణం ఆలస్యం అయ్యిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మౌళిక వసతులు, సామాగ్రిని ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే సమకూరుస్తామని అన్నారు. అయితే ఆసుపత్రికి జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు, కాంపౌండ్ వాల్, అగ్నిమాపక యంత్రాలు, ఆర్వో వాటర్ ప్లాంటు, ఆపరేషన్ థియేటర్ పరికరాలు, రోగుల సహాయకులు వేచి ఉండే గది, వంటగది, లిఫ్ట్, పోలీసు ఔట్ పోస్టు అవసరమని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వాటన్నింటినీ త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కోటపల్లి బాబు రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, బేగం, డాక్టర్ సహదేవయ్య, డాక్టర్ మమతా లక్ష్మి, పంచాయతీ ఈవో గురు మోహన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, టిడిపి నేతలు శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, డాక్టర్ మల్లెల రెడ్డిబాష, లడ్డూ జాఫర్, కోటపల్లె శ్రీనాథరెడ్డి, షౌకత్ అలీ, చాన్ బాష, మహమ్మద్ పీర్, సాధన, రమాదేవి, పురం రెడ్డమ్మ, లక్ష్మీకాంతమ్మ, వాణి, ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ సరోజమ్మ, వైద్యులు డాక్టర్ నాగవేణి, డాక్టర్ కరీముల్లా, డాక్టర్ వసీం, డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, డాక్టర్ హరీష్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ సింధుజ, నర్సింగ్ సూపరింటెండెంట్ షరీఫ్ జాన్, హెడ్ నర్స్ శారద, ఆసుపత్రి పరిపాలనాధికారి భాస్కర్, ఆఫీస్ సూపరింటెండెంట్ శివ, తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

- ఎపిఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు వెంకట శివారెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

2023 జులై నుంచి పిఆర్‌సి రావాల్సి ఉందని, వెంటనే అమలు చేయాలని ఎపి ఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎపిఎన్‌జిజిఒ హోమ్‌లో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనం, గెస్ట్ రూములను ఆయన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాలు ఎపిఎన్‌జిజిఒ రాయచోటి తాలూకా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వెంకట శివారెడ్డి మాట్లాడుతూ ఎన్‌జిఒ హోమ్‌లో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనం, గెస్ట్ రూములను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎపి ఎన్‌జిఒ హోమ్‌లు అన్ని మతాలకు దేవాలయాలు లాంటివన్నారు. 74 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఎపిఎన్‌జిఒ1947లో ఉద్భవించిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు కనివిని ఎరుగని రీతిలో నష్టపోయారన్నారు. రివర్స్ పిఆర్‌సి తీసుకునే పరిస్థితులు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వంలో జీతాలు కూడా 1న వచ్చేవి కావని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జీతాలు 1న వస్తున్నాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ డిపార్టుమెంటులో తీసివేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో పిఆర్‌సి కమిషన్ రాజీనామా చేసి వెళ్లడంతో ఇంత వరకు నూతన కమిషన్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లినట్లు ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలపర్తి విద్యా సాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 3600 మంది ఉద్యోగులపై కేసులు పెట్టారని ఈ విషయాన్ని ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి రివ్యూ చేసి కేసులు ఎత్తివేయాలని కోరామని చెప్పారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలని, కనీసం ఈనెలలో అయిన ఒక్క డిఎను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగి సాయంత్రం 5 గంటలు దాటితే ఇంటికి వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాస్త ఆలస్యం అయినా ఉద్యోగులు పనిచేసి వెళ్తారని స్పష్టం చేశారు. శని, ఆదివారాల్లో కూడా ఉద్యోగులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్ సిస్టం కొన్ని డిపార్టుమెంటులకు బాగానే ఉన్న ఫీల్డ్ పై పనిచేసే వారికి చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ఫీల్డ్‌పై ఉద్యోగాలు చేసే వారికి మినహాయింపు ఇవ్వాలని చెప్పారు. ప్రతి డిపార్టుమెంటులో రిక్రూట్మెంట్ జరగక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే ఉద్యోగ నియమాకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిఎన్ జిజిఒ రాష్ట్ర సహ అధ్యక్షులు దస్తగిరిరెడ్డి, ఎపిఎన్‌జిజిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, ఎపిఎన్‌జిజిఒ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్‌రావు, రాష్ట్ర సెక్రటరీలు రంజిత్ కుమార్ నాయుడు, ఎస్.బి.విరామ్ ప్రసాద్, ఎంవి కృష్ణారెడ్డి, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు రవికుమార్ పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎపి ఎన్‌జిజిఒ నాయకులు

వాడవాడలా మేడే సంబరాలు

పీలేరులో ర్యాలీ చేస్తున్న కార్మికులు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికులు, శ్రామికులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. వామపక్షాలు, వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా వాడవాడలా అరుణ పతాకం రెపరెపలాడింది. రాయచోటి, మదనపల్లెలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు ఎర్రజెండాలు చేతపట్టి ఎక్కడికక్కడ దండుగా కదిలారు. ప్రదర్శనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలపై నిప్పులు చెరిగారు.

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్మికులందరు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించు కోవాలని ఐటియుసి మదనపల్లి డివిజన్ కన్వినర్ జి. కృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. మదనపల్లె సర్వ జన ప్రభుత్వ బోధన ఆసుపత్రి లో ఐటియుసి ఆధ్వర్యం లో సీనియర్ కామ్రేడ్ మౌలాలి తో కలసి ఎర్ర జెండా ఆవిష్కరించి మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది, కార్మికులతో కలసి నినాదాలు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, 12 గంటల పని చట్టాన్ని చేస్తున్నారని దాన్ని ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు మాలతి, గిరిబాబు, హెల్పింగ్ మైడ్స్ అధ్యక్షులు అబు బక్కర్ సిద్దిక్, శానిటేషన్ వర్కర్స్ సూరి, పార్వతి, అలివేలు, రేణుక, సెక్యూరిటీ సిబ్బంది రెడ్డెప్ప, తులసి రమణ, ఈశ్వరయ్య, చలపతి, గజపతి, చంద్రశేఖర్, ఇస్మాయిల్, వెంకటాద్రి, కార్మికులు, పాల్గొన్నారు. **మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ** :స్థానిక కురువంక సచివాలయంలో ఘనంగా మే డే దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పంచాయతీలో పనిచేస్తున్న 19 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు, బ్లౌసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ షబానా, వైస్ సర్పంచ్ నాగరాజు, వార్డు మెంబర్ అండ్ నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ జి. కృష్ణమూర్తి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **చిట్వేలి:** మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్ లు వ్యతిరేకంగాపోరాడాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కొత్త నాని, యదురూరి సుజాతమ్మ పిలుపు నిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్యలు, వికలాంగుల సంఘం అధ్యక్షులు జె ఆంధ్రయ్య, మల్లారపు గురవయ్య, ఎం.ఆనందయ, ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు ఎం మల్లికార్జున, ఆర్.మనోహర్, లక్ష్మయ్య, సాదక్‌బాషా, రాజ, సాధక్‌వలి, పెంచలయ్య కార్మికులు పాల్గొన్నారు. **కలికిరి:** మేడేని పురస్కరించుకుని కలికిరి హమాలి సంఘం నాయకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో జెండా ఎగుర వేసి అమరులైన విప్లవ నాయకులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం సభ్యులు ముస్తఫా, మహమ్మద్ రఫీ, టీ రెడ్డప్ప, ప్రసాద్, రవి, మోహన్లు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మండల వ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ హమాలి వర్కర్స్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, అంగన్వాడీ, ఎలక్ట్రిసిటీ, ఆటో యూనియన్, విఆర్ ఎ ఉద్యోగ సంఘాలుతో కలిసి 8 కంద్రాలలో ఎర్రజెండా రెపరెపలాడించారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఈశ్వరమ్మ, విజయ, అమరావతి, శివరంజని, విద్యుత్తు ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్, బాలకృష్ణ, బాలాజీ, ఆర్ఐ కుమారస్వామి, విఆర్ఒ సుధాకర్, శంకర్, నరసింహులు, ఆటో యూనియన్ నాయకులు నరసింహులు, పెంచలయ్య, మార్కెట్ హమాలి యూనియన్ నాయకులు రాముడు, భీమయ్య పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలో ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని సిపిఎం, సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ లక్ష్మి, మనీ, గీత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం :** ప్రపంచ కార్మిక సమస్యలపై కలిసికట్టుగా ఏర్పాటు చేస్తున్న మేడేను విజయవంతం చేద్దామని మండల సిఐటియు నాయకులు కె.నాగబసిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మేడే సందర్భంగా సిఐటియు జెండాను చేత భూని అసంఘటిగా కార్మికుల కార్మికుల అంగన్వాడీలో విఆర్ఎల సమస్యలపై ఆయా సంఘాలు కలిసికట్టుగా రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి అంగన్వాడీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ నాయకురాలు ఓబులమ్మ, రామపురం మండల నాయకురాలు చిట్టెమ్మ పాల్గొన్నారు. **పీలేరు:** మేడే సందర్భంగా పీలేరులో ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ మిట్టపై పంచాయతీ కార్మికులు ఎర్ర జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఎఎంసి చైర్మన్ పురం రామ్మూర్తి, టిడిపి నాయకులు కోటపల్లి బాబు రెడ్డి, స్పోర్ట్ మల్లి, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, యుటిఎఫ్ మాజీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు జి. రాధాకృష్ణ, పాల్గొన్నారు. యుటిఎఫ్ మాజీ నాయకులు జి. రాధాకృష్ణ, పంచాయతీ కార్మికుల సంఘం పీలేరు అధ్యక్ష కార్యదర్శులు బివి రమణ, ఓబులేసు, కోశాధికారి నాగార్జు, తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ ఎస్.డబ్ల్యూ.ఎఫ్ సంఘం ఆధ్వర్యంలోనూ అరుణ పతాకాన్ని ఎగురవేసి కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కెసిఎస్ రెడ్డి, బాబు, చంద్ర, సురేంద్ర పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులు పట్టణంలో ఊరేగింపు చేశారు. **పుల్లంపేట**: మేడేను పురస్కరించుకొని శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు వనజా కుమారి, సెక్టార్ లీడర్స్ చెంచులక్ష్మి, నాగలత, రోజా, విఆర్ఎలు వెంకట సుబ్బయ్య, సుబ్రమణ్యం ఆటో యూనియన్ శీను పాల్గొన్నారు. **గాలివీడు :** కార్మికుల హక్కుల కోసం పోరాడి సాధించిన విజయమే మేడే అని సిఐటియు మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి పేర్కొన్నారు. స్థానిక సచివాలయం వద్ద మే డే సందర్భంగా ఏర్పాటు చేసే సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోరాడి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్న ఘనత లభించి నదని పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలు చేశారు. మే డే వర్ధిల్లాలి, సిఐటియు జిందాబాద్, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సభ్యురాలు ఓబులమ్మ, సాజిదా, లక్ష్మీదేవి, ఈశ్వరమ్మ, ఆశ వర్కర్లు విఆర్ఎలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్వేలిలో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

గాలివీడు : ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు

మదనపల్లి: నినాదాలు చేస్తున్న కార్మికులు

రాజంపేట: జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రతి కూలీకి పని కల్పించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతికూలికి తగిన పని కల్పించాలని ఎపి వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.శోభ డిమాండ్ చేశారు. దిగవ మాచిరెడ్డిగారిపల్లి పెద్ద చెరువు నందు మే డే దినోత్సవం సందర్భంగా వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో కలసి మే డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పెద్ద చెరువులో ఫారంపాండ్స్ పనులు చేస్తున్న 35మంది కూలీలు ఉపాధి హామీ బిల్లులను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ప్రతి వ్యక్తికి జాబు కార్డు ఇవ్వాలని, ఒక వ్యక్తికి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, పనులు ఎంపిక పంచాయతీలో ప్రజల ముందు జరగాలని కోరారు. ఒక రోజుకి వేతనము ఒక వ్యక్తికి రూ.850లు ఇవ్వాలన్నారు. వారానికి ఒకసారి బిల్లులు చెల్లించి, పే స్లిప్పులు ఇవ్వాలని అన్నారు. పని వద్ద నీడ, తాగునీరు, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పనుల్లో ప్రమాదవశాత్తు కూలి మరణిస్తే ప్రభుత్వం బాధ్యత వహిస్తూ ఆ కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. శ్రమశక్తి సంఘాలు 20 మందికి ఒక్క మేట్ ఏర్పాటు చేసి వారికీ అలవెన్సు అమలు చేయాలన్నారు. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధం చేసి, రైతుల వ్యవసాయ ఖర్చులను తగ్గించి, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నేడు డిజిటల్ బిపి యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలలో పనిచేస్తున్న ఎఎన్ఎంలకు డిజిటల్ బ్లడ్ ప్రెజర్(బిపి) యంత్రాలను శుక్రవారం పిటిఎం ప్రభుత్వ ఆసుపత్రి లో పంపిణీ చేయనున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ డిజిటల్ బిపి మానిటర్లను ఎఎన్ఎంలకు ఇవ్వడం వల్ల హైపర్ టెన్షన్‌ను తొందరగా గుర్తించగులు గుతారని అన్నారు. ముఖ్యం గా గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో బీపిని గుర్తించడంలో సులభతరం అవు తుందన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా అన్ని రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజ లకు ఎటువంటి సహాయ, సహకారాలు అవసరమున్నా తమ ఫౌండేషన్ ను సంప్రదించాలన్నారు.

నగర పంచాయతీ మేనేజర్‌గా రాము

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీ మేనేజర్‌గా టి.రాముని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హిందూపురం మున్సిపాలిటీలో కేటగిరి–4 కింద విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పిస్తూ కేటగిరీ–3 కింద మేనేజరుగా నియమించారు.మేజర్ పంచాయతీగా ఉన్న బి.కొత్తకోటను నగర పంచాయతీగా అప్ గ్రేడ్ చేసినప్పటి నుంచి అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఇప్పటికే పలువురు కమిషనర్లు మారగా ప్రస్తుతం జివి.పల్లవి కమిషనర్‌గా కొనసాగుతోంది. ఇదే క్రమంలో నగర పంచాయతీకి మేనేజర్ నియమించడం అభివృద్ధికి సంకేత మని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ప్రవేశ పరీక్షలో విరాజ్ ఆనంద్‌కు మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-పుల్లంపేట : ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ పాఠశాల ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలోపుల్లంపేట మండలంలోని దళవాయిపల్లి పాఠశాల విద్యార్థి విరాజ్ ఆనంద్ 100కి 87 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.పాఠశాల ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని అభినందించారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తాయని చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ అని ఆ విద్యార్థి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బస్టాండ్ పనులను పరిశీలించిన ఎంపీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని బైపాస్‌లో గారాల మడుగు గ్రామపంచాయతీ పుల్లంపేట గ్రామ పంచాయతీ సరిహద్దులో నిర్మిస్తున్న నూతన బస్సు షెల్టర్‌ను అత్యంత ఆధునికంగా నిర్మిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం నూతనంగా నిర్మిస్తున్న బస్సు షెల్టర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.15 లక్షల వ్యయంతో బస్సు షెల్టర్ ని నిర్మిస్తున్నామని అన్నారు. ఎంపిపి ముద్దా వెంకటసుబ్బారెడ్డి మాట్లా డుతూ బస్ షెల్టర్ నిర్మాణంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. పుల్లంపేట, సీతారాంపేట మధ్య ఉన్న పుల్లంగేరు పాత బ్రిడ్జిని మరమ్మతులు చేయాలని ఆయన దృష్టికి తీసుకురాగా ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోదని గత ప్రభుత్వ హయాంలో తాను మూడుసార్లు బ్రిడ్జి దెబ్బతినగా సుమారు మూడు లక్షల రూపాయల తన సొంత నిధులను ఖర్చుపెట్టి బ్రిడ్జిని మరమ్మతులు చేయించానని అన్నారు. శ్మశానంలో ప్రహరీ నిర్మించాలని అడగగా తహశీల్దార్ అనుమతిస్తే ఒక్కరోజులోనే ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భోగా వెంకటరత్నమ్మ, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు రామనాథము, విజయ్‌కుమార్‌రెడ్డి, భోగా పార్థసారథి, బాలసుబ్రమణ్యం, రాంబాబు, కొత్తపేట అనుమల వెంకటేశులు, వైసిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-వీరబల్లి

న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మోహన్ నాయక్, ఎంపిడిఒ నూర్జహాన్ సూచించారు. గురువారం మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్దహరిజనవాడలో ఆంజనేయ స్వామిగుడి దగ్గర సివిల్ రైట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల పై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవిన్యూ శాఖ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తహశీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఎంపీడీవో నూర్జహాన్ అన్నారు. గ్రామాల్లో ఒకరి నోకరు కలిసికట్టుగా జీవనం సాగించాలని గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని గ్రామస్థులకు ఎస్ఐ మోహన్ నాయక్ సూచించారు. మండలంలో ఎక్కడైనా ఎస్సి, ఎస్టిల పైన దాడులు బెదిరింపులు జరిగి న్యాయం జరగకపోతే తమ దృష్టికి తీసు కురావాలని అన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేటట్లు చూస్తామని ఎస్సి, ఎస్టిల పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అధిక ప్రాధాన్యత తీసుకుంటుందని జిల్లా ఎస్సి, ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో గ్రామ విఆర్ఒ నరసింహులు, పంచాయతీ సెక్రెటరీ సంజీవరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోళ్ళ సురేంద్ర, రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సి, ఎస్టి చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేద్దాం : 'నల్లారి'

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ వైద్యశాలను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కలికిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులైన డాక్టర్ టి.వెంకటరమణారెడ్డి, ఎల్.మహమ్మద్ అస్లాం, కె.గీత, కలికిరి ఇఒ జి.అశోక్, కలికిరి ఎంపిడిఒ పి.బాను మూర్తి, కన్వీనర్ డాక్టర్ వై.పవన్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కలికిరి 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేయడానికి కృషి చేస్తానన్నారు. కలికిరి ఆసుపత్రికి కావలసిన పరికరాలు సమకూరుస్తానని చెప్పారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ద్వారా ఆసుపత్రుల ర్యాకింగ్‌లో కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రస్థాయిలో మూడో స్థానం రావడానికి కారణమైన ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ వై.పవన్‌కుమార్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో ఆసుపత్రిలో స్పెషలిస్ట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ముఖ్యంగా గర్భిణులు, చిన్నపిల్లలకు జనరల్ సర్జరీ కేసులకి పీలేరు అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌కిరణ్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సిమ్రాన్, డాక్టర్ అన్వేష్, ఇన్‌ఛార్జి హెడ్ నర్స్ వనజమ్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల జోలికొస్తే చర్యలు : సిఐడి డిఎస్‌పి

ప్రజాశక్తి-కలకడ

అగ్రిగోల్డ్ భూములు జోలికొస్తే కఠిన చర్యలు తప్పవని సిఐడి డిఎస్‌పి కొండయ్య నాయుడు హెచ్చరించారు. గురువారం తాహసిల్దార్ కార్యాలయంలో ఆయా భూములకు సంబంధించి వివరాలను డిప్యూటీ తాహసిల్దార్ భార్గవిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని బాలయ్య గారిపల్లి గుడిబండ, కె.దొడ్డిపల్లి గ్రామాలలో 237 ఎకరాలు ఉందని ఇదివరకే గుర్తించడం జరిగిందని తెలిపారు. శుక్రవారం నుంచి ఆయా గ్రామాలలో రెవెన్యూ అధికారులతో కలిసి భూములు పరిశీలించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనునట్లు తెలిపారు. అగ్రిగోల్డ్ భూములలో ఆక్రమణలకు పాల్పడిన, సాగుకు ప్రయత్నించిన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎల్‌ఎ జి.వి.భాస్కర, అగ్రి వెల్ఫేర్ అసిస్టెంట్ రాధాకృష్ణ రమేష్ బాబు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల వివరాలను సేకరిస్తున్న ఎసిడి డిఎస్‌పి కొండయ్య నాయుడు

మహిళా సాధికారతే చంద్రబాబు లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

మహిళా సాధికారతే సిఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక షాదీ మహల్లో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి చేతివృత్తులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అందులో భాగంగానే బిసి మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దగ్గరలోనే జెఎన్‌టియు ప్రక్కన గార్మెంట్స్ కంపెనీ ప్రారంభమవుతుందని, అందులో సుమారు 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కకార్యక్రమంలో ఎంపిడిఒ భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపిడి ఒమహమ్మద్ రియాజుద్దీన్, ఇఒ జి.అశోక్, ఎపిఒ మంజుల, ఎపిఎం, టిడిపి నాయకులు యోగేష్‌రెడ్డి, ఎర్రంరెడ్డి రమేష్ పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండల కేంద్రం సుండుపల్లి జడ్‌పి హైస్కూల్‌లో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. మహిళల కోసం ప్రభుత్వమే కుట్టు మిషన్ ఉచితంగా అందిస్తుందని, ప్రతి మహిళ గౌరవప్రదంగా ఆర్థికంగా ఎదగాలని ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. డ్వాక్రా సంఘాలకు ఎస్సి, ఎస్టి,బిసి, నిరుపేదలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యంగా టిడిపి మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పేదలకు ఆసరా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు, విభిన్న ప్రతిభావంతులకు రూ.6వేలుకు పెంచి పింఛన్లు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు : పిడుపాటకు రెండు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు కథను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు మండలం, సోంపల్లి పంచాయతీ, అడవి నాయుడు చెరువుపల్లి చెందిన మస్తానప్ప ఆవులతో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పిడుగు పడటంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. పశువైద్యాధికారి నివేదిత మృతి చెందిన పశువులను పరిశీలించి నివేదికను అధికారులకు నివేదించనున్నారు. ఆవులు కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాము కాటుకు గురైన విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పాము కాటుకు గురైన విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురై ఆసు పత్రిలో చేరాడు. విద్యార్థి తల్లిదండ్రుల తెలిపిన వివరాల మేరకు.. వాల్మీ కిపురం మండలం, చింతపర్తి పంచాయతీ, పాతకోటపల్లికి శ్రీనాథ్‌రెడ్డి కుమా రుడు నిశాంత్‌రెడ్డి(14) 8వ తరగతి పరీక్షలు రాసి వేసవి సెలవులు కావడ ంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం ఉదయం తమ వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం గట్టుపై నడుచుకుని వెళ్తుండగా చెట్లపొదల్లో దాగున్న పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధిత విద్యార్థిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో బిటెక్ విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెంకటేష్(ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో బిటెక్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారు జామున పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా, మహానంది మండలం, మసీదుపురం చెందిన చిన్న రాముడు కుమారుడు వెంకటేష్(21) అంగళ్లులోని మిట్స్ కళాశాలలో బిటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. కడప జిల్లా, కమలా పురంకు చెందిన వెంకట శివారెడ్డి (23) మిట్స్‌లో బిటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఇద్దరు విద్యార్థులు కలిసి అంగళ్లులో ఓ అద్దె రూములో ఉంటున్నారు. కాగా పనిమీద ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంలో పలమనేరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని మదనపల్లె, బికెపల్లి బైపాస్ రోడ్డులో వెళ్తూ రాయల్ వుడ్ ఫర్నిచర్ షాప్ వద్ద రోడ్డు పక్కన ఓ చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని 108లో స్థానిక మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, సిటిఎం క్రాస్ రోడ్ కు చెందిన వెంకటేష్, నిర్మల దంపతులు కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. తీవ్ర మనస్థాపానికి గురైన వెంకటేష్ విషపూరితమైన గన్నేరు పప్పు తిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు. చౌడేపల్లి మండలం, చిన్న కొండామర్రి గ్రామానికి చెందిన రమణ భార్య రజిత గత కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులలో చూపించిన జబ్బు నయం కాలేదు. తీవ్ర మనస్థాపానికి గురై నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చౌడేపల్లి పోలీసులు విచారణ చేస్తున్నారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయస్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ సి.తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. అగ్రహారం పంచాయతీ అరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎన్.లక్ష్మయ్య నాటుసారాను తీసుకువచ్చి ప్రజలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బంది దాడులు చేసి అతని వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా కలిగి పోలీసులకు పట్టుబడ్డ నిందితుని పై కేసు నమోదు చేసి అతనిని రిమాండు కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నాటుసారా విక్రయాలపై పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు దొంగల ముఠా అరెస్టు

చోరీ సొత్తు స్వాధీనం : అర్బన్ సిఐ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఓ ఇంట్లో చోరీ చేసిన ఆరుగురు దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ సిఐ బి. వెంకట చలపతి అన్నారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి 8 గంటల సమయంలో మండలంలోని ఎండపల్లి గ్రామం, పెద్దరామిరెడ్డిగారిపల్లిలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం పట్టణ శివారులోని గాలివీడు రింగ్ రోడ్డు వద్ద ఎస్ఐ ఎం.అబ్దుల్ జహీర్, జిల్లా క్రైమ్ పార్టీ ఎస్ఐ రామకృష్ణారెడ్డి దొంగలను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 6.1 తులాల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు అనంతపురం జిల్లాకు చెందిన వారీగా గుర్తించారు. వీరిలో ఒక వ్యక్తిపై చోరీ కేసు నమోదై ఉందని తెలిపారు. కేసును ఛేదించిన క్రైమ్ పార్టీ ఎస్ఐ సిబ్బందిని అభినందించారు. వేసవి శెలవులో ఊర్లకు వెళ్లే వారు ఎల్‌హెచ్ఎంఎస్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సిఐ వెంకట చలపతి